అంబర్‌పేట

కూరగాయల ధరలు

తిలక్‌నగర్, న్యూస్‌టుడే: గోల్నాక మార్కెట్టులో సోమవారం కూరగాయల ధరలు ఈ విధంగా ఉన్నాయి. రూపాయలలో... టమాట-22, ఆలుగడ్డ-20, వంకాయ-18, క్యాబేజీ-18, బెండకాయ-25, దొండకాయ-15, కాకరకాయ-20, బీర్సా-40, దోసకాయ-16, సొరకాయ-15, బీరకాయ-35, క్యాప్సికం-25, చామగడ్డ-40, పచ్చిమిర్చి-40, ఉల్లిగడ్డ-15, వెల్లుల్లి-70, అల్లం-150.

ఎట్టకేలకు మోక్షం..!

- కాచిగూడ బస్‌డిపో ప్రారంభం
- ఏడాదిన్నర పాటు ఎదురుచూపు
- తొలుత 40 బస్సు సర్వీసులు

న్యూస్‌టుడే, కాచిగూడ

సుదీర్ఘ నిరీక్షణ అనంతరం కాచిగూడ ఆర్టీసీ కొత్త బస్‌డిపోకు మోక్షం లభించింది... కొత్త బస్‌డిపో నిర్మాణం పూర్తై ఏడాదిన్నర గడిచినా దాన్ని ప్రారంభించడానికి ఆర్టీసీ ఉన్నతాధికారులు మీనమేషాలను లెక్కించారు... ఆర్టీసీ బస్‌డిపో నిర్మాణం పనులు పూర్తయ్యాక బస్సులకు కావాల్సిన ఇంధనం కోసం పెట్రోల్ పంపు నిర్మాణం పనులను కొద్దిరోజులు చేపట్టారు... ఆ తర్వాత బస్‌డిపో నిర్మాణం పూర్తైనా ఏడాది పాటు ప్రారంభించకుండా పట్టించుకోకుండా వదిలేశారు... ప్రస్తుతం కొత్త బస్‌డిపోను ప్రారంభించడంతో స్థానికుల రాకపోకలకు మరింత సౌకర్యవంతంగా తయారైంది...

క్వార్టర్ల కూల్చివేత...

కాచిగూడలో ఆర్టీసీ క్వార్టర్స్ 10 ఎకరాల స్థలంలో విస్తరించి ఉన్నాయి. ఇందులో మొత్తం 18 బ్లాకులు ఉండేవి. కొత్త బస్‌డిపో నిర్మాణం కోసం మూడేళ్ల క్రితం మూడెకరాల స్థలంలో ఉన్న కొన్ని ఆర్టీసీ క్వార్టర్స్ బ్లాకులను కూల్చివేశారు. వాటిని కూల్చివేయడానికి అందులో నివాసం ఉంటున్న ఆర్టీసీ ఉద్యోగులు, సిబ్బందిని ఖాళీ చేయించడం అప్పట్లో వివాదాస్పదమైంది. కోట్లాది రూపాయలు ఖర్చు చేసి నిర్మించిన క్వార్టర్లను బస్ డిపో నిర్మాణం కోసం కూల్చివేయడంపై విమర్శలు వెల్లువెత్తాయి. ఆర్టీసీ క్వార్టర్స్‌లో గోడౌన్ కోసం ప్రైవేట్ వ్యక్తులకు లీజుకు ఇచ్చిన స్థలంలో కొత్త డిపోను ఏర్పాటు చేస్తే బాగుండేదనే అభిప్రాయం వ్యక్తమైంది.

స్థానికుల నిరసన...

కాచిగూడ, ఆర్టీసీ క్వార్టర్స్‌లో మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన ఆర్టీసీ బస్సులను నిలిపి ఉంచడానికి అనుమతించడం వలన స్థానికంగా తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని ఎప్పటి నుంచో స్థానికులు నిరసన వ్యక్తం చేస్తున్నారు. పొరుగు రాష్ట్రాల బస్సులతో కాలుష్యం ఏర్పడుతుందని ఆరోపిస్తున్నారు. కొత్తగా కాచిగూడ బస్ డిపో నిర్మాణాన్ని చేపట్టడం వలన ఈ సమస్య మరింత తీవ్రమవుతుందని స్థానికులు పేర్కొంటున్నారు. రాత్రిపూట బస్సులతో శబ్దకాలుష్యం ఏర్పడి కంటిమీద కునుకు కరువవుతుందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దుమ్మురూళీ కణాలతో శ్వాసకోస తదితర వ్యాధులు వచ్చే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.

నేతల సంఘీభావం...

దీన్ని నివారించడానికి బస్‌డిపో ప్రధాన ద్వారాన్ని నింబోలిఅడ్డ ఎన్క్రీ హన్నల్ వైపునకు ఏర్పాటు చేయాలని కోరుతూ రవాణా మంత్రి బొత్స సత్యనారాయణతో పాటు ఆర్టీసీ ఎండీకి వినతిపత్రాలను అందజేశారు. స్థానికుల ఆందోళనకు ఎంపీ అంజన్‌కుమార్‌యాదవ్, బాజపా రాష్ట్ర అధ్యక్షులు, ఎమ్మెల్యే కిషన్‌రెడ్డి, స్థానిక కార్పొరేటర్ కస్రె ఉమ తదితరులు సంఘటనా ప్రాంతాన్ని సందర్శించి తమ సంఘీభావాన్ని ప్రకటించారు. స్థానికుల డిమాండ్లను ఆర్టీసీ అధికారులు పరిశీలించాలని కోరారు.

రూ. 2.5కోట్లతో..

రూ. 2.5 కోట్లతో ఆర్టీసీ బస్‌డిపో నిర్మాణం పనులను వీసీఆర్ కన్‌స్ట్రక్షన్ సంస్థ దక్కించుకుంది. 2011లో పనులను ప్రారంభించి ఏడాదిలోగా పూర్తి చేసింది. నిర్మాణం పూర్తైన ఎప్పుడు ప్రారంభమవుతుందా అని ఎదురు చూసిన కల ప్రస్తుతానికి నెరవేరింది. ప్రారంభంలో 40 బస్సులను కాచిగూడ డిపో నుంచి నడుపుతున్నారు. మరికొద్ది రోజుల్లో ఆర్టీసీ బస్సుల సంఖ్య 200లకు చేరుకుంటుందని ఆర్టీసీ అధికారులు అంటున్నారు. తద్వారా కాచిగూడ నుంచి నగరం నలుమూలలకు ఆర్టీసీ బస్సులు రాకపోకలు సాగించడానికి వీలుకలుగుతుంది. కాచిగూడ రైల్వేస్టేషన్ నుంచి రాకపోకలు సాగించే రైల్వే ప్రయాణికులకు కూడా ప్రయోజనం చేకూరనుంది.

కళాశాల ముందు ఏబీవీపీ ఆందోళన

నల్లకుంట, న్యూస్‌టుడే: పదోతరగతి ఫలితాలు విడుదల కాకముందే ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం తరగతులు ప్రారంభించడాన్ని ఏబీవీపీ తప్పుపట్టింది. ఇందుకు నిరసనగా సోమవారం నల్లకుంటలోని నారాయణ కళాశాల ఎదుట ఏబీవీపీ నాయకులు ఆందోళనకు దిగారు. వెంటనే తరగతులు బంద్ చేయాలని డిమాండ్ చేశారు. కొనసాగుతున్న తరగతులను బలవంతంగా బహిష్కరించి విద్యార్థులను పంపించేశారు. దీంతో తరగతులు నడుపమని కళాశాల ప్రిన్సిపల్ హామీ ఇవ్వగానే నాయకులు ఆందోళనను విరమించారు. నేతలు కల్యాణ్, ప్రేమ్, శ్రీకాంత్, రమాకాంత్, నరేష్, హేమంత్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల్లోపే తెలంగాణను తేల్చాలి

నల్లకుంట, న్యూస్‌టుడే: అన్ని రాజకీయ పార్టీలు తెలంగాణ ప్రధాన ఎజెండాగా 2014 ఎన్నికల్లో ముందుకెళ్లాలని తెలంగాణ టీఎస్ఎన్ఎల్ ఉద్యోగుల సంక్షేమ సంఘం డిమాండ్ చేసింది. ఇటీవల రాజకీయాల్లో చాలా పరిణామాలు చోటు చేసుకుంటున్నాయని, వివిధ పార్టీల్లో సీనియర్లుగా ఉన్న నేతలు పార్టీల మార్పిడి జరుగుతోందని, ఎవరు ఏ పార్టీలో ఉన్నా తెలంగాణకు అనుకూలంగా పనిచేయాలని ఆ సంఘం ఛైర్మన్ వేణుగోపాల్ కోరారు. రాజకీయ లబ్ధి కోసం పార్టీలు మారకుండా ఒక ప్రధాన లక్ష్యంగా ముందుకెళ్లాలని సూచించారు. అలాగే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ ఎన్నికల్లోపే తెలంగాణ అంశానికి తెరదించాలని కోరారు.

బీటెక్ విద్యార్థిని అదృశ్యం

కాచిగూడ: బీటెక్ విద్యార్థిని అదృశ్యమైన సంఘటన కాచిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ సుబాష్‌బాబు కథనం ప్రకారం... చప్పల్‌బజార్‌కు చెందిన వెంకటేశ్వర్లు కూతురు బి.తులసీ (20) బీటెక్‌ను పూర్తి చేసింది. ఈ నెల 11న ఇంటి నుంచి వెళ్లిన ఆమె తిరిగి రాలేదు. ఆమె కోసం అన్నిచోట్ల వెదికినా ప్రయోజనం లేకపోవడంతో తండ్రి సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎస్సై సైదులు కేసును దర్యాప్తు చేస్తున్నారు.

రైలు కిందపడి ఆటోడ్రైవర్ ఆత్మహత్య

కాచిగూడ: రైలు కిందపడి ఆటోడ్రైవర్ ఆత్మహత్య చేసుకున్న సంఘటన కాచిగూడ రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. రైల్వే ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు కథనం ప్రకారం... సీతాఫల్‌మండికి చెందిన లక్ష్మణ్ సుధీర్‌కుమార్ (45) ఆటో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. మనస్పర్థల కారణంగా అతనికి తన భార్యతో తరచూ గొడవ జరిగేది. ఆమెను తన ప్రవర్తన మార్చుకోవాలని కోరినా ఫలితం లేకపోవడంతో సుధీర్‌కుమార్ జీవితంపై విరక్తి చెందాడు. అతను సోమవారం సీతాఫల్‌మండి స్టేషన్ వద్ద రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. శవాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. రైల్వే ఎస్సై రియాజ్ అహమ్మద్ కేసును దర్యాప్తు చేస్తున్నారు.

గృహిణి ఆత్మహత్య

నల్లకుంట, న్యూస్‌టుడే: అనారోగ్యంతో బాధపడుతున్న ఓ గృహిణి ఆత్మహత్య చేసుకున్న సంఘటన నల్లకుంట పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం... విద్యానగర్‌లోని దయానంద్‌నగర్‌కు చెందిన వీరయ్య, మాధవిలు భార్యాభర్తలు, వీరికి ఇద్దరు పిల్లలు. వీరయ్య సెక్రటేరియట్‌లోని ఫైనాన్స్ శాఖలో ఉద్యోగి. అయితే... మాధవి(40) కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతోంది. దీంతో ఈనెల 12వ తేదీ రాత్రి తనకు ఆరోగ్యం సహకరించడంలేదని, ఇంట్లో అందరు కలిసి పనులు చేయాలని చెప్పింది. ఇదే సందర్భంలో చిన్నపాటి వాగ్వాదం కూడా జరిగింది. సోమవారం ఉదయం 11 గంటల సమయంలో మాధవి తన గదిలోకి వెళ్లి ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. కాసేపటికి విషయాన్ని గమనించిన కుమారుడు తలుపులు పగులగొట్టి లోనికి వెళ్లి చూడగా ఉరేసుకొని కన్పించింది. అప్పటికే మాధవి మృతి చెందినట్లు గమనించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు.

కానిస్టేబుల్ ఉచిత శిక్షణార్థులకు పుస్తకాలు పంపిణీ

పుస్తకాలు పంపిణీ చేస్తున్న సందీప్ శాండిల్య

గోల్నాక: కానిస్టేబుల్ ఉచిత శిక్షణార్థులకు స్టడీమెటీరియల్‌ను పంపిణీ చేశారు. సోమవారం అంబర్‌పేట సీపీఎల్‌లో జరిగిన కార్యక్రమంలో నగర అదనపు పోలీస్ కమిషనర్ (నేరాలు) సందీప్ శాండిల్య చేతుల మీదుగా స్టడీ మెటీరియల్ పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... శ్రమ, పట్టుదల, నిరంతర అభ్యాసం ద్వారా పోటీ పరీక్షల్లో విజయం సాధించవచ్చని తెలిపారు. ప్రతిభ ఉండి శిక్షణ తీసుకోలేని పేద విద్యార్థుల కోసం నగరంలోని అంబర్‌పేట సీపీఎల్, గోషామహల్, పెట్లబుర్జులో మూడుచోట్ల ఉచితంగా కానిస్టేబుల్ రాతపరీక్ష శిక్షణా కేంద్రాలను ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. వీటికి వందల సంఖ్యలో నిరుద్యోగ యువతీ, యువకులు దరఖాస్తు చేసుకున్నారన్నారు. వారికి స్టడీమెటీరియల్‌ను ఉచితంగా అందజేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో అంబర్‌పేట సీపీఎల్ కమాండెంట్ జనార్దన్, శిక్షణా కేంద్రాల సమన్వయకర్త రాజశేఖర్, శిక్షకులు రాంప్రసాద్, నాయుడు, సుబ్రహ్మణ్యం, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాలు కల్పించాలి

విద్యానగర్, న్యూస్‌టుడే: జనాభాకు అనుగుణంగా మౌలిక సదుపాయాలు కల్పించాలని, డ్రైనేజీ, తాగునీరు పైప్‌లైన్లు, రోడ్లు ఆధునికీకరించాలని జోనల్ కమిషనర్ రోనాల్డ్‌రాస్‌ను విద్యానగర్ కార్పొరేటర్ అడప చంద్రమౌళి కోరారు. సోమవారం డివిజన్‌లోని వివిధ బస్తీలలో కమిషనర్‌తో కలసి పాదయాత్ర చేశారు. డీడీ కాలనీ నుంచి సోమసుందరనగర్ వరకు డ్రైనేజీ పైపులైన్లను వెంటనే ఆధునికీకరించాలని కార్పొరేటర్ కమిషనర్‌కు విజ్ఞప్తి చేశారు. తరచుగా ఈ ప్రాంతంలో డ్రైనేజీ లీకవుతోందని వివరించారు. అనంతరం టీఆర్‌టీ క్వార్టర్స్‌లోని నర్సింహ్మబస్తీలో రైల్వే ట్రాక్‌కు వాల్‌సు వెంటనే నిర్మించాలని, ఇక్కడ ప్రమాదాలు జరిగే అవకాశం ఎక్కువగా ఉందని తెలిపారు. అదే విధంగా విక్రంపురి, డీడీ కాలనీలో రోడ్ల మరమ్మతు పనులు ప్రారంభించాలని కోరారు. ఎన్‌సీసీ చౌరస్తాలో ట్రాఫిక్ ఐల్యాండ్ నిర్మించాలని తెలిపారు.

రోనాల్డ్‌రాస్‌కు సమస్యలు వివరిస్తున్న కార్పొరేటర్ అడప

అధికారులు సాయప్పరెడ్డి, బాలమురళీ, సంతోష్, అశోక్, తెదేపా నాయకులు టీఆర్.చందర్, యూసఫ్, సురేష్, హసన్, యాదగిరి, కిషోర్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

ఆదిశంకరాచార్య జయంతి వేడుకలు 15న

బాగ్‌లింగంపల్లి, న్యూస్‌టుడే: విశాఖ శ్రీ శారదా పీఠాధిపతులు ఆదిశంకరాచార్య జయంతి వేడుకలు ఈనెల 15న త్యాగరాయగాన సభలో నిర్వహించనున్నట్లు ఆం.ప్ర. బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు ద్రోణంరాజు రవికుమార్ తెలిపారు. బుధవారం సాయంత్రం కార్యక్రమం జరుగుతుందన్నారు.

పద్మజారాణికి ఘన సన్మానం



పద్మజారాణిని సన్మానిస్తున్న త్రినాథరావు

విద్యానగర్, న్యూస్‌టుడే: జ్యోతిర్వాస్తునిలయం వ్యవస్థాపకురాలు డాక్టర్ ఈడ్గుగంటి పద్మజారాణిని ఎస్‌బీఐ ఏజీఎం త్రినాథరావు ఘనంగా సన్మానించారు. సంస్థ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజల్లో జ్యోతిర్వాస్తుపై అవగాహన కల్పిస్తూ, వివిధ ప్రచార సాధనాల ద్వారా సలహాలు, సూచనలు అందిస్తున్నారని తెలిపారు. జ్యోతిషాస్త్రంలో ఆమె చేస్తున్న సేవలకుగాను స్వర్ణకంకణం అందుకున్నారని, ఇది ఆమె ప్రతిభకు గుర్తింపని ఆయన అన్నారు. నందగోపాల్, రామకృష్ణ, మల్లికార్జున శర్మ, హరిహర నందన్, బాల కృష్ణ, అనంతలక్ష్మితో పాటు పలువురు పాల్గొన్నారు.

ఈనాడు దినపత్రికలో ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్) కొరకు సంప్రదించవలసిన ఫోన్ నంబర్లు 99596 15855, 80087 09975
క్లాసిఫైడ్ యాడ్స్ కొరకు సంప్రదించగలరు 99080 16959
ఈనాడు దినపత్రిక కావలసిన వారు ఈ ఫోన్ నెంబర్లను సంప్రదించగలరు. 96525 35305
ఈనాడు టోల్ ఫ్రీ 1800-425-8888 మీకు ఏ భాష్యా లేకుండా మాట్లాడవచ్చు ప్రతి రోజూ ఉదయం ఎనిమిది నుంచి రాత్రి ఎనిమిది గంటల వరకు